‘సేల్సు మ్యానేజరౌతావు కాని, విశాఖపట్టణం నుంచి నాకేం తెచ్చావు?’ అంది హటాత్తుగా రంగంలోకి ప్రవేశించిన జానకి. గోపాలం ఆమెవేపు అప్రయత్నంగా చూసి అర్థరహితంగా నవ్వేడు.

‘వాడి సెంట్లూ సబ్బులూ అరగదీస్తూనే వున్నావుగా, ఇంకా యేం తేవాలి.’

‘నువ్వూరుకో అత్తయ్యా, అప్పుడే నీ సాధింపులూ నువ్వూను. ఏం బావా? బెల్లంకొట్టిన రాయిలా వులకవేం!’

అతను విసుగ్గా లేచి ‘వుండూ’ అన్నాడు. లేస్తే ఆరడుగులవిగ్రహం. ఉంగరాల చిన్న జుత్తు—విశాలమైన నుదురు. కోలముక్కు—గర్వంగా వొంపులతిరిగిన గడ్డం—నూనూగుమీసాలు. అతనిని చూసినప్పుడల్లా జానకికి గుండెల్లో ‘ఆశల గుఱ్ఱాలు పరుగెడుతాయి. కాని వెంటనే అతడు సమీపించరాని యేదో మహత్తరశక్తిలా తోచి చిన్నబోతుంది.

ఈలోగా విశాలాక్షమ్మ లోపలికి వెళ్ళి వచ్చింది. ‘ఇదిగోనే జానీ, గోపాలం నీకు తెచ్చింది.....’

‘ఆహాయ్! సంపెంగపూలు—ఏం వాసన! సింహాచలంలో కొన్నావా బావా? అత్తయ్యా మనం యెప్పుడైనా సింహాచలం వెళ్ళాలి. బావ చెప్పేడు, ఆ వూరు, ఆ కొండకోనలు, జలధారలు - ఆహా! ఎంతో చూడ యింపుగా వుంటాయట...’

‘నీ పెళ్ళికి వెడతాంగా......’ విశాలాక్షమ్మ యెగతాళిగా అంటించింది. గోపాలం దిగ్గున లేచి వెడిపోయేడు. ‘వీడికి ఆడదానికన్న సిగ్గట్టా’ అంటూ విశాలాక్షమ్మ లోపలికి వెళ్ళింది. గోపాలం వెనకాలే జానకి మేడ యెక్కింది. పరుగు పరుగున మెట్లు దిగి వెడిపోతూంటే విశాలాక్షమ్మ లోపలినుంచి ‘అదేవిటే’ అంది. జానకి ఆగకుండా చెయ్యెత్తి ‘కొత్త రకం సబ్బు’ అని కూతపెట్టి తుఱున పారిపోయింది.

## 3

ఆవేళ సాయంత్రం ఐదు దాటిన తరవాత జానకి, జానకిరామయ్యగారింటికి వెళ్ళింది. విశాలాక్షమ్మ లోపలి వరండాలో యీజీచైరుమీద తీరికగా కూచుని వార్తాపత్రిక చదువుకుంటూంది. జానకి రాక ఆ యిల్లాలు సులోచనాలదోరుమీంచి గమనించింది.



